రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇందూరు బాయ్స్ గురుకుల విద్యార్థి

కంఠేశ్వర్, ఫిబ్రవరి 15 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మహాత్మా జ్యోతిబా పూలే ఇందూరు బాయ్స్ గురుకుల విద్యార్థి శ్రీనివాస్ ఎంపికైనట్లు ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంయుక్త గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని గురువారం అభినందించారు.

యూనియన్ బ్యాంక్‌లో 'ఖాతాదారుల ఇంటరాక్ట్'

కార్యక్రమంలో మాట్లాడుతున్న యూబీఐ రీజినల్ హెడ్ శంకర్ హెంబ్రం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 15 : జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో ఖాతాదారుల ఇంటరాక్ట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ శంకర్ హెంబ్రం హాజరై మాట్లాడారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను వివరించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషిచేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ రాంప్రసాద్, శివకోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 15 : జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడుతల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. ఉదయం జనరల్ విద్యార్థులు 107 మందికి 107 మంది హాజరయ్యారని, వొకేషనల్‌లో 149 మందికి 139 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 14 మందికి అందరూ, వొకేషనల్‌లో 159 మందికి 147 మంది హాజరైనట్లు తెలిపారు. అధికారులు 8 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఘనంగా ధర్మభిక్షం జయంతి

కోటగిరి, ఫిబ్రవరి 15 : గీతకార్మికుల కుటుంబాల ఆశాజ్యోతి ధర్మభిక్షం అని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. కోటగిరిలో ధర్మభిక్షం 102వ జయంతిని గీతపనివారల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

మాజీ సర్పంచ్‌కు కన్నీటివీడ్కోలు

ధర్పల్లి, ఫిబ్రవరి 15 : ధర్పల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్ గుండెపోటుతో మృతిచెందగా అంత్యక్రియలను గురువారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ధర్పల్లి సర్పంచ్‌గా రెండు సార్లు పనిచేసి మంచి పేరును గడించిన బాల్‌రాజ్ మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు అని జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ అన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ విద్యార్థులు

సిరికొండ, ఫిబ్రవరి 15 : రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. గతేడాది డిసెంబర్‌లో జిల్లాస్థాయి ఆన్‌లైన్ ప్రదర్శనలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కృతిక తయారుచేసిన కార్న్ కాబో రోస్టింగ్ మిషన్, (మక్కజొన్న కంకులను కాల్చేందుకు ఉపయోగపడే యంత్రం), 7వ తరగతికి చెందిన విద్యార్థి అద్వైత్‌రెడ్డి తయారుచేసిన ఫిలింగ్ ట్రగైన్స్ ఆపరేటింగ్ మిషన్ (ధాన్యాన్ని కుప్పగా, ఆరబెట్టుటకు ఉపయోగపడు యంత్రం) ప్రాజెక్టును సమర్పించారు. గైడ్ టీచర్ సతీశ్ పర్యవేక్షణలో ప్రాజెక్టులు సమర్పించగా.. రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

టీయూలో సేవాలాల్ జయంతి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగ్ భండార్ నిర్వహించడంతోపాటు సంత్ సేవాలాల్ ఆలయాల్లో పూజలు చేశారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సేవాలాల్ చూపిన మార్గం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమన్నారు.

ధర్పల్లిలోని అన్ని తండాల్లో సేవాలాల్ జయంతి, వేడుకలు నిర్వహించారు. ఇందల్వాయి మండలకేంద్రంలో నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమానికి ఎంపీపీ రమేశ్‌నాయక్ హాజరయ్యారు. రుద్రూర్ మండలంలోని సులేమాన్‌నగర్ తండాలో గిరిజన పెద్దల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి, సేవాలాల్ చిత్రపటానికి క్షీరాభిషేకం, పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు చేసిన సంప్రదాయ నృత్యాలు చేశారు. వర్ని మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు తండాల్లో సేవాలాల్ జయంతి నిర్వహించారు. డిచ్‌పల్లిలోని టీయూలో ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌లో సేవాలాల్ జయంతిని ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక అధ్యక్షతన నిర్వహించారు. రిజిస్ట్రార్ యాదగిరి హాజరై మాట్లాడారు. సిరికొండ మండలకేంద్రంలోని బంజారాభవన్‌లో భోగ్ భండార్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీమన్‌పల్లిలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు విఠల్‌నాయక్ ఆధ్వర్యంలో భోగ్ భండార్ నిర్వహించారు. మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ డీసీసీ మాజీ అధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ ప్రారంభించారు.

మాక్లూర్ మండలంలోని మానిక్‌బండార్, అమ్రూద్ గ్రామాల్లో నిర్వహించిన ఉత్సవాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని తండాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ తండాలో జగదాంబ, సేవాలాల్ ఆలయాల వద్ద భోగ్ భండార్ నిర్వహించి నైవేద్యం సమర్పించారు. బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి, బెల్లాల్, మినార్‌పల్లి ఆటోనగర్ తదితర తండాల్లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఏర్గట్ల మండలం బట్టాపూర్ గిరిజన తండాలో..

రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ తండాలో..

సిరికొండ మండలం చీమన్‌పల్లిలో...

మానిక్‌భండార్ తండాలో పూజలు చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

తుదిశ్వాస వరకు కేసీఆర్‌తోనే ఉంటా..

■ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా స్పష్టీకరణ

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 15 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తుది శ్వాస వరకు ఉంటానని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా స్పష్టంచేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమం నుంచి మొదలైన తన రాజకీయ ప్రస్థానం.. చివరి వరకు కేసీఆర్‌తోనే కొనసాగుతుందని తెలిపారు. సోషల్ మీడియాల్లో తనపై వస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు.

రోడ్డు విస్తరణపై సర్వేయర్లకు అవగాహన

సర్వేయర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: 63వ జాతీయ విస్తరణలో భూములు కోల్పోయే రైతులకు అవగాహన కల్పిస్తూ పనులు కొనసాగించాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. సర్వేయర్లతో గురువారం తన కార్యలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోటార్మూర్ 63వ జాతీయ రహదారి నుంచి కమ్మర్‌పల్లి మండలం గండి హనుమాన్ ఆలయం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. సుమారు 25 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం రోడ్డుకు ఇరువైపులా భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు.

కుట్టుమిషన్ల పంపిణీ

కుట్టుమిషన్లను అందజేస్తున్న హెల్ప్ టు అదర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 15 : నగరంలోని ఎల్లమ్మగుట్టలో ముగ్గురు పేదల మహిళలకు అమెరికాకు చెందిన హెల్ప్ టు అదర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. సంస్థ ఇండియా ప్రతినిధి జిల్కర విజయానంద్ మాట్లాడుతూ.. సంస్థ అధ్యక్షురాలు శ్రీలత కొరడా నేతృత్వంలో ఇప్పటివరకు 12 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశామని తెలిపారు.

ఈవీఎంల లోడ్ టెస్ట్ పరిశీలన

సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 15 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియలో భాగంగా గురువారం లోడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. ఎన్నికల్లో అత్యధిక మంది అభ్యర్థులు పోటీలో ఉన్న పక్షంలో అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక్కో కంట్రోల్ యూనిట్‌కు నాలుగేసి చొప్పున బ్యాలెట్ యూనిట్లను అనుసంధానిస్తూ వాటి పనితీరును పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో ఈసీఐఎల్ ఇంజినీర్లు ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. కలెక్టర్ వెంట జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

- డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15 : టీయూలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ యాదగిరికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని, హెల్త్‌కేర్‌లో డాక్టర్లను నియమించాలని, మెస్‌బిల్లులపై నిఘా ఉంచాలని, యూనివర్సిటీలో ఆడిటోరియం, మినీ స్టేడియం నిర్మించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.
- ఇందల్వాయి, ఫిబ్రవరి 15 : మండలంలోని గన్నారంలో శ్రీనవనాథ సిద్ధేశ్వర జాతరను శుక్రవారం నిర్వహించనున్నట్లు పద్మశాలీ సంఘ సభ్యులు తెలిపారు. ఉదయం యజ్ఞంతోపాటు పూజలు, అన్నదానం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.
- జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 15 : జక్రాన్‌పల్లి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సతీశ్‌కుమార్‌ను ఎంపీపీ కుంచాల విమలారాజు, వైస్ ఎంపీపీ తిరుపతి గురువారం సన్మానించారు.
- మోపాల్ (ఖలీల్‌వాడి)/ చందూర్, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, రాజేశ్వర్ కోరారు. మోపాల్‌లో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. చందూర్‌లో పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసును ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు.
- నందిపేట్, ఫిబ్రవరి 15: ఇటీవల బదిలీ అయిన ఎంపీడీవో నాగవర్ధన్‌ను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సన్మానించారు. ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో వరదరాజన్, సిబ్బంది పాల్గొన్నారు.
- మోర్తాడ్, ఫిబ్రవరి15: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలనికి ఈనెల 29 వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న, కోఆర్డినేటర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.
- ముప్కాల్, ఫిబ్రవరి15: ఇటీవల జిల్లాలో పిల్లల కిడ్నాప్ కేసులు పెరిగాయని, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై భాస్కరచారి అన్నారు. వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.
- వేల్పూర్, ఫిబ్రవరి 15: నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన బాలకిషన్‌ను గురువారం జీపీ కార్యాలయంలో కార్యదర్శి వినోద్ ఆధ్వర్యంలో సన్మానించారు. మాజీ సర్పంచ్ తీగెల రాధామోహన్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.
- ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: ఖమ్మం జిల్లాలో మార్చి 4,5,6 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎంఎల్ మూడు పార్టీల మాస్‌లైన్ యూనిటీ విలీన మహా సభలను జయప్రదం చేయాలని ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి జయరాం కోరారు. గురువారం పట్టణంలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు.
- ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి15: దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌కు పీడీఎస్‌యూ మద్దతు ఇస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.
- ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: చేపూర్, కోమన్‌పల్లి, ఫత్తేపూర్ గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.
- భీమ్‌గల్, ఫిబ్రవరి 15: దేవన్‌పల్లి, పల్లికొండ, బాచన్‌పల్లి, పిప్రి, పురాణిపేట్ గ్రామాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్‌కుమార్ సందర్శించారు. పారిశుద్ధ్యం, హరితహారం కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడారు.
- మోర్తాడ్, ఫిబ్రవరి15: రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై మొండివాగుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి కూలిపోయిందని, అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించాలని కోరుతూ మోర్తాడ్ మండల దళితసంక్షేమసంఘం నాయకులు మల్లూరి రాజారాం, జాంభవ, మామిడి గంగాధర్, ముత్తెన్న గురువారం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.
- శక్కర్‌నగర్, ఫిబ్రవరి 15: బోధన్ పట్టణంలోని శ్రీ ఏకచక్రేశ్వర శివమందిరంలో బుధవారం రాత్రి బోధన్ పట్టణ, మండల వీరశైవ జంగమ- లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సంత్‌శిరోమణి శ్రీ మన్మథస్వామి జయంతిని నిర్వహించారు. అనంతరం మహా అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.
- రెంజల్, ఫిబ్రవరి 15: నీలా- పేపర్‌మిల్ గ్రామాల శివారులో వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఎస్సై విక్రం తెలిపారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన రెండు టిప్పర్ల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన టిప్పర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పీఎం కిసాన్ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

బాల్కొండ, ఫిబ్రవరి 15: బోదేపల్లి గ్రామంలో పీఎం కిసాన్ ఈ-కేవైసీ, ఆధార్ సీడింగ్‌పై మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ ద్వారా నగదు పొందుతున్న రైతులు ఆధార్‌తో మొబైల్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని, మొబైల్‌లో లేదా ఏఈవో వద్ద లేదా దగ్గరలోని మీ సేవ కేంద్రంలో ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో ఇంకా 43 మంది ఈ-కేవైసీ, 58 మంది ఆధార్ సీడింగ్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. వీరు సంబంధిత పత్రాలతో ఈ-కేవైసీ, ఆధార్ సీడింగ్ పూర్తి చేసుకుంటేనే వచ్చే విడుత నుంచి పీఎం కిసాన్ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో నిహారిక, బీపీఎం సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్

బోధన్, ఫిబ్రవరి 15: మండల కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ రజితా యాదవ్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో రజితా యాదవ్‌కు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు ఆమె భర్త, బీఆర్ఎస్ నాయకుడు ఎల్లయ్య యాదవ్ కాంగ్రెస్‌లో చేరారు.

పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 15 : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నందిపేట్ మండలం లక్కంపల్లి శివారులో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు ఆదేశాల మేరకు సీఐ అజయ్, సిబ్బంది గురువారం దాడిచేశారు. పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.35,300 నగదును సీజ్ చేసి, జూదరులను నందిపేట్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

66 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్, ఫిబ్రవరి15: మానిక్‌బండార్ శివార్‌లో గురువారం 66 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. మెంట్రాజ్‌పల్లికి చెందిన నవాబు ఆర్మూర్ నుంచి డీసీఎంలో బియ్యం తరలిస్తున్నాడని చెప్పారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి15: పట్టణంలోని అపోలో మెడికల్ షాప్ ఆవరణలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 70 నుంచి 75 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచినట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

జీవితంపై విరక్తిచెంది యువకుడి ఆత్మహత్య

ఎడపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు... కుర్నాపలికి చెందిన ఈర్ల మల్లేశ్ (34) వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కడుపు నొప్పి భరించలేక పలు దవాఖానాల్లో చూపించుకున్నాడు. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437

CHANGE OF NAME

★I, JAIDI GANGU, R/o. H.No. 2-83, Jakranpally, Nizamabad-503 175, TS. Changed My Name to JAIDI VIJAYA, W/o. Jaidi Narsaiah.
NT-311760

PASSPORT MISSING

★I MANNE VISHAL S/o MANNE RAMESH R/o.H.No: 1-118, SC Wada, Vill :Waddiyat , Mdl:Morthad, Nizamabad, నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. W4087782 గలది Waddiyat నుండి Morthadకు బైక్‌పై వెళ్లుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికిననూ సంప్రదించగలరు. సెల్ : 90104 91894
NTZ-324525

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తొర్లికొండలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

జీపీ కార్మికులు, సిబ్బందిని సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ముగిసిన పారిశుద్ధ్య వారోత్సవాలు

■ కార్మికులకు సన్మానం

కోటగిరి/ డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి/ సారంగపూర్/మాక్లూర్/ కమ్మర్‌పల్లి/ మోర్తాడ్/ఏర్గట్ల, ఫిబ్రవరి 16 : పారిశుద్ధ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందిని గురువారం ఘనంగా సన్మానించారు. కోటగిరి జీపీ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకాధికారి కేఆర్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్మికులు చేపడుతున్న సేవలను కొనియాడారు. డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లిలో నిర్వహించిన గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మూడనమ్మకాలను విశ్వసించవద్దని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండలో అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, ఆశవర్కర్లను ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులను అధికారులు ఘనంగా సన్మానించారు.

మాక్లూర్ మండలంలోని మాదాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొని మురికి కాలువలను రోడ్లను శుభ్రం చేశారు. గ్రామంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీల్లో మురికినీరు నిల్వకుండా చూసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా ట్యాంకులను శుభ్రపర్చుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జడ్పీ చైర్మన్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. మాజీ సర్పంచులను, ఉత్తమ అంగన్‌వాడీ టీచర్, ఆశవర్కర్లు, సఫాయి కార్మికులను జడ్పీ చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, ఎంపీటీసీ లలిత పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండలంలోని బష